నమస్తే తెలంగాణ
సిద్దిపేట
13 | హైదరాబాద్, గురువారం 7 మార్చి 2024 | SIDDIPET

ఎల్ఆర్ఎస్‌పై భగ్గుమన్న బీఆర్ఎస్

ఎన్నికల సమయంలో ఉచితమని హామీలు ఇప్పుడు గడువు విధిస్తూ రుసుము కట్టుకోవాలని ఆదేశాలు ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ శ్రేణులు నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీ, ధర్నాలు అధికారులకు వినతి పత్రాల అందజేత

మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, మార్చి 6: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఒక మాట, వచ్చాక ఒకమాట మాట్లాడుతున్నదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ధ్వజమెత్తారు. ఎల్ఆర్ఎస్‌పై బుధవారం నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి 90 రోజులు గడుస్తున్నా కాంగ్రెస్ సర్కారు హామీలను సరిగ్గా అమలు చేయడం లేదని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలో వచ్చాక మరోలా ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ వ్యవహరించడం దుర్మార్గమైన చర్య అని ఆమె విమర్శించారు. ధర్నాలో జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ మన్సూర్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, బీఆర్ఎస్ యువ నాయకుడు సంతోశ్‌రెడ్డి, బీఆర్ఎస్‌కేవీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, తొంట వెంకట్, సుధాకర్‌రెడ్డి, నగేశ్, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఆర్‌డీవో రాజుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

హామీలు అమలు చేయకుంటే పోరాటమే

జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, మార్చి 6: శాసన సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేపట్టాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గృహం నుంచి భారీ ర్యాలీతో ఆర్డీవో కార్యాలయానికి చేరుకుకున్నారు. అనంతరం ధర్నా నిర్వహించి ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేస్తామని చెప్పి, ఇప్పుడు డబ్బులు వసూలు చేస్తుందని మండిపడ్డారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.గుండప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకల్ సుభాశ్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, బీఆర్ఎస్ జహీరాబాద్ మండలాధ్యక్షుడు తట్టు నారాయణ, బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్, రాములునేత, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మాటమార్చడం కాంగ్రెస్ నాయకులకు అలవాటు

బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి

మెదక్, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : ఎల్ఆర్ఎస్‌పై రాష్ట్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా మెదక్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆపార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలువడం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చడం కాంగ్రెస్ పార్టీ నాయకులకు అలవాటుగా మారిందన్నారు. అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేస్తామని 2020 అక్టోబర్ 10న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పిన మాటలు ఉత్తమాటలుగానే మిగిలిపోయాయని ధ్వజమెత్తారు. డిసెంబర్ 9న రైతులకు రెండు లక్షల రుణమాఫీ అని ఇప్పటి వరకు చేసిన దాఖలాలు లేవన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి. నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, కొట్టాల విశ్వం, సులోచన, జయరాజ్, వసంతరాజ్, సమీయొద్దీన్, మెదక్, నిజాంపేట్ ఎంపీపీలు యమునజయరాంరెడ్డి, సిద్ధిరాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అంజాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, పట్లూరి రాజు, సుధాకర్‌రెడ్డి, నాయకులు సోములు, లక్ష్మిరెడ్డి, రాగిఅశోక్, లింగారెడ్డి, శ్రీధర్ యాదవ్, సలాం, కృష్ణ, అంజద్, రామచంద్రారెడ్డి, జుబేర్, బట్టి ఉదయ్, సాయిలు, కిషన్ బాలరాజు, మోహన్ పాల్గొన్నారు.

మాటమార్చిన కాంగ్రెస్‌పై ధ్వజమెత్తిన నేతలు

కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై బీఆర్ఎస్ ధ్వజమెత్తింది. ఎల్ఆర్ఎస్ ఉచితమని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఏమైంది.. అంటూ బీఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బుధవారం నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకత్వం అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేస్తామని, ఇప్పుడు మాటమార్చి గడువు విధిస్తూ రుసుము కట్టుకోవాలని ఆదేశాలు ఇవ్వడంపై వారు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని, ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. జనం పక్షాన నిలిచి ధర్నా చేసిన బీఆర్ఎస్ శ్రేణులకు ప్రజలు మద్దతు పలికారు.

గజ్వేల్ నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

ఎల్ఆర్ఎస్‌పై మాట మార్చిన కాంగ్రెస్

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మార్చి 6: అధికారంలోకి వచ్చిన వెంటనే ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలుచేస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు నేడు మాటమార్చారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎల్ఆర్ఎస్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాడు ఉచితంగా ఎల్ఆర్ఎస్ అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు నేడు అధికారంలోకి రాగానే 20లక్షల కుటుంబాలపై రూ.20కోట్ల భారం వేసేందుకు సిద్ధమయ్యారని, ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజలను దొచుకోవడం సరికాదన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను పునరుద్ధరిస్తే గతంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకించారని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మించిందన్నారు. ఒక ఫిల్లర్‌ను సాకుగా చూపి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నిర్మించిన మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయక సాగర్‌లోకి నీళ్లు నింపకుండా ప్రభుత్వం కుట్రపన్నుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు బాలేశ్, చందు, రజిత, బీఆర్ఎస్ అధ్యక్షుడు నవాజ్‌మీరా, కుమార్, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బయ్యారం శ్రీనివాస్‌రెడ్డి, జాఫర్‌ఖాన్, గుంటుకరాజు, సాయిరెడ్డి, కిషన్‌రెడ్డి, యాదవరెడ్డి, కనకయ్య, జైపాల్‌రెడ్డి, రామచంద్రం, స్వామిచారి, దుర్గాప్రసాద్, ఆంజనేయులు, బీరప్ప పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, చిత్రంలో బీఆర్ఎస్ నాయకులు

వంచించడమే కాంగ్రెస్ నైజం

రాష్ట్ర ప్రభుత్వ పనితీరును ఎండగట్టిన సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, మార్చి 6: మాయమాటలతో ప్రజలను వంచించడమే కాంగ్రెస్‌పార్టీ నైజమని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ దుయ్యబట్టారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఉచితంగా ఎల్ఆర్ఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేస్తామని, ఇప్పటి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోర్టులో కేసు వేసిన విషయం మార్చిపోయి మార్చి చివరిలోగా ఎల్ఆర్ఎస్ కట్టాలని అధికారులు ఆదేశాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారంలోకి రాకముందు ఒకమాట, వచ్చాక మరోమాట మాట్లాడడంతో కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపం భయటపడిందన్నారు. అన్నదాతలకు పంట పెట్టుబడి సాయాన్ని ఇంతవరకు అందించలేని కాంగ్రెస్ ప్రభుత్వం, రుణమాఫీని ఒకేసారి చేస్తామని ప్రకటించి పక్కన పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 420 హామీలు, 6గ్యారెంటీలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రభుత్వ పనితీరును రుజువు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎల్ఆర్ఎస్‌పై 26.44 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టేందుకు కోమటిరెడ్డి కోర్టులో కేసు వేసి నిలిపివేశారన్నారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని, ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, ఎంపీపీ యాదమ్మ, నాయకులు జైపాల్‌రెడ్డి, నరహరిరెడ్డి, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, బీరయ్యయాదవ్, ఆత్మకూర్, శివరాజ్ పాటిల్, నగేశ్ మల్లాగౌడ్, మధుసూదన్‌రెడ్డి, పండల పాండురంగం, మాజీ సర్పంచ్ మోహన్‌నాయక్, కసిని శ్రీకాంత్, వెంకటేశం, ఆజీమ్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ పేరిట కాంగ్రెస్ దోపిడీ

నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 6: ఎల్ఆర్ఎస్ పేరిట ప్రజలను నిలువు దోపిడీ చేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆరోపించారు. ఎల్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ బుధవారం ఆయన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నారాయణఖేడ్‌లో నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. తాము అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేసి ఉచితంగా ఇండ్ల స్థలాలను క్రమబద్ధీకరిస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఓట్లు దండుకుని ప్రస్తుతం ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్‌ను వ్యతిరేకించిన రేవంత్‌రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు తిరిగి ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, పట్టణ అధ్యక్షుడు నగేశ్, నాయకులు ఎం.ఏ.నజీబ్, పార్శెట్టి సంగప్ప, ప్రభాకర్, రవీందర్‌నాయక్, సిద్ధయ్య స్వామి, అంబాదాస్, శేఖర్, లయక్, గోపాల్, రాజు, దత్తు, సాల్మన్ పాల్గొన్నారు.

నారాయణఖేడ్ ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

తాగునీటి కొరత రాకుండా చూడాలి

సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

సిద్దిపేట అర్బన్, మార్చి 6: అధికారులు సమన్వయంతో పని చేసి ఎలాంటి తాగునీటి కొరత రాకుండా చూడాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి ఆదేశించారు. బుధవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో డీఎల్‌పీవో, ఎంపీడీవో, ఎంపీవో, మిషన్ భగీరథ ఈఈ, డీఈ, ఏఈలతో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్‌వాల్‌తో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా తాగునీటి కొరత గల ప్రాంతాలు, ఎలా ఎదుర్కోవాలో లాంటి విషయాల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మిషన్ భగీరథపైన ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ఈ డ్రైవ్‌లో గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఎక్కడెక్కడ తాగునీటి కొరత ఉంది, పైల్‌లైన్ లీకేజీలు, వాటర్ ట్యాంక్ మరమ్మతులు, క్లోరినేషన్ ప్రక్రియతో పాటు దూరంగా ఉన్న నివాసాలకు సైతం తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పీఎం విశ్వకర్మ పథకం, ఎస్ఆర్ ఈజీఎస్, ప్రజాపాలన సేవా కేంద్రాలు తదితర వాటిపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జయదేవ్‌ఆర్యా, జడ్పీ సీఈవో రమేశ్, డీపీవో దేవకీదేవి, మిషన్ భగీరథ ఎస్ఈ శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

ప్రజలపై భారం మోపితే సహించం

హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్, మార్చి 6: ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజలపై పెనుభారం మోపితే సహించేదిలేదని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎల్ఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఎల్ఆర్ఎస్‌ను ప్రవేశపెట్టినప్పుడు ప్రస్తుతం మంత్రులుగా ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్కలు ఎన్నో విమర్శలు చేశారన్నారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని అప్పట్లో వారు డిమాండ్ చేశారన్నారు. కానీ నేడు మళ్లీ ఎల్ఆర్ఎస్‌ను పెట్టి ప్రజల నుండి పెద్ద మొత్తంలో డబ్బులు గుంజేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో హనుమకొండ జడ్పీచైర్‌పర్సన్ డాక్టర్ సుధీర్‌కుమార్, హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, నాయకులు వంగ వెంకట్రామ్‌రెడ్డి, అన్వర్, తిరుపతిరెడ్డి, ఆకుల వెంకట్, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

బీవీఆర్ఐటీలో విద్యుత్ వాహనాల పోటీలు

మహిళా ఇంజినీరింగ్ విద్యార్థులు డిజైన్ చేసిన ఎలక్ట్రిక్ వాహనాన్ని ప్రారంభిస్తున్న యాజమాన్యం, అతిథులు

నర్సాపూర్, మార్చి 6: నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో బుధవారం విద్యుత్ వాహనాల పోటీ (ఈ-బాజా సైండియా-2024) అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలకు జాతీయ స్థాయిలోని ఐఐటీఎస్, నీట్ విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ సంస్థల నుంచి 2400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి భాహా సైండియా ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు సంజయ్ నిభాన్, రెనాల్ట్ నిస్సాన్ టెక్ ఇంజినీరింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హీరోటెక్ హరాడా, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) స్టేట్ హెడ్ అచ్మెన్ ట్రెహాన్, ఇన్నోవేషన్ హీరో మోటో కార్ప్ సీనియర్ మేనేజర్ మనీశ్ సింగాల్ తదితరులు హాజరయ్యారు. విజేతలకు రూ.8 లక్షల నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఆరు జట్లు పాల్గొనగా, ఈసారి మరో ఆరు జట్లు పాల్గొన్నాయని, కార్యక్రమానికి దేశంలోని అన్ని రాష్ట్రాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని తెలిపారు. అనంతరం కళాశాలకు చెందిన మహిళా ఇంజినీరింగ్ విద్యార్థులు డిజైన్ చేసిన ఆల్ టెరైన్ సింగిల్ సీటర్ ఈ-బగ్గీ వాహనాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఆదిత్య విస్సం, చైర్మన్ విష్ణు రాజు వీడియో సందేశాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్ దూబే, మేనేజర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కేతకీలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

ఎనిమిది రోజుల పాటు వైభవంగా జరుగనున్న ఉత్సవాలు

ఝరాసంగం, మార్చి 6: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని మొగిలి (కేతకీ) వనంలో వేలిసి, దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి వైభవంగా ప్రారంభంకానున్నాయి. ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్దఎత్తున భక్తులు రానున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమృతగుండంలో స్నానాలు ఆచరించే వారికి ప్రత్యేక చర్యలు, షవర్లు, మొబైల్ టాయిలెట్లు, తాగునీరు, పార్కింగ్, విద్యుత్ సౌకర్యం వంటి అన్ని ఏర్పాట్లు చేశారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో అంబులెన్స్‌తోపాటు వైద్యశిబిరం, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణ, జహీరాబాద్ ఆర్టీసీ డిపో నుంచి 15 నిమిషాలకు ఒక బస్సు చొప్పున నడిపేందుకు చర్యలు తీసుకున్నారు. బారికేడ్లు, ప్రత్యేక క్యూలైన్లు, అదనంగా సీసీ కెమెరాలు, లడ్డూ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయంలో పౌరసంబంధాలశాఖ ఆధ్వర్యంలో పాటలు, చలనచిత్ర ప్రదర్శన, డ్రామా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. డీఎస్పీ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్సైలతో పాటు వందమంది సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేశారు.

మెదక్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రాహుల్‌రాజ్

బాధ్యతలు స్వీకరించిన మెదక్ కలెక్టర్

మెదక్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లా కలెక్టర్‌గా రాహుల్‌రాజ్ బుధవారం ఉదయం ఐడీవోసీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్, ఆర్డీవో రమాదేవి, కలెక్టర్ కార్యాలయ ఏవో యూనిఫ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, పీఆర్ ఈఈ నర్సింలు, ఏడీ మైన్స్ జయరాజ్, ఇతర శాఖల అధికారులు నూతన కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా అభివృద్ధి, సంక్షేమంతో పాటు వివిధ అంశాలపై నూతన కలెక్టర్ అధికారులతో చర్చించారు.